అమ్మడానికి అవస్థలెన్నో..

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాల లేమి..
- మిషన్ల కొరతతో రోజుల తరబడి పడిగాపులు
- టార్పాలిన్ల అద్దెతో అన్నదాతలకు అదనపు ఖర్చు


సుజాతనగర్‌లోని కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

సుజాతనగర్: ఎండనక.. వాననక ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్మేందుకు, ఆరబెట్టేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ధాన్యం సేకరణ కోసం సుజాతనగర్, వేపలగడ్డలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విక్రయించేందుకు రైతులు ధాన్యంను తరలిస్తుండగా మిషన్ల కొరతతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. టార్పాలిన్లను అద్దెకు తెచ్చుకొని మరీ ధాన్యం ఆరబెట్టుకోవడంతో అన్నదాతలపై అదనపు భారం పడక తప్పడం లేదు.

కేంద్రాల్లో పడిగాపులు

మండలంలో ప్రస్తుతం రెండు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు 900 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ముఖ్యంగా సుజాతనగర్ రెవెన్యూ పరిధిలో సుమారు 3 నుంచి 4 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. కేవలం ఇక్కడి నుంచే 750 మెట్రిక్ టన్నుల ధాన్యం రానుంది. అయితే కొనుగోలు కేంద్రాల్లో రైతుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించక పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ తూర్పారబట్టే మిషన్లు ఐదారు అవసరం ఉండగా.. కేవలం రెండింటినే అధికారులు ఏర్పాటు చేశారు. ఈ రెండు మిషన్ల ద్వారా రోజులో కొంత ధాన్యాన్ని మాత్రమే తూర్పారబడుతున్నారు. మిషన్ల కొరతతో శాతానికి వచ్చిన ధాన్యం తూర్పార పట్టే పరిస్థితి లేకపోవడంతో రోజుల తరబడి పడిగాపులు పడుతున్నారు. త్రీఫేస్ విద్యుత్ సరఫరా సాయంత్రం నిలిచిపోవడంతో అప్పటి వరకే తూర్పారబడుతున్నారు. కల్లాల్లో ధాన్యం రాశుల కుప్పలు అలాగే మిగిలి ఉంటున్నాయని రైతులు వాపోతున్నారు.

అద్దె భారం..

ప్రస్తుతం సబ్సిడీ టార్పాలిన్లు అందజేయడాన్ని ప్రభుత్వం నిలిపివేయడంతో రైతులు నానా తిప్పలు పడుతున్నారు. అద్దెకు టార్పాలిన్లు, పట్టాలు తీసుకురావడంతో అన్నదాతలపై అదనపు భారం పడుతోంది. రోజుకు రూ.20 చొప్పున వ్యాపారులు టార్పాలిన్లను అద్దెకు ఇచ్చే దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. సాధారణంగా ప్రతి రైతుకు కనీసం ఆరు నుంచి పది టారాల్పిన్ల వరకు అవసరం ఉంటాయి. దీంతో రోజుకు రూ.200 వరకు అదనపు భారం పడుతోంది. పంట నూర్పిడి చేయడం, ఆరబెట్టడం, సంచుల్లో నింపి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించడానికి కనీసం 15 నుంచి 20 రోజుల సమయం పడుతోంది. ఈ లెక్కన రైతులపై టార్పాలిన్ల భారం దాదాపు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు పడుతోంది. నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు సౌకర్యాలు కల్పించడం లేదు. దీనికి తోడు అకాల వర్షాల సూచనతో కొనుగోలు కేంద్రం వద్ద ఉంచిన ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు.

టార్పాలిన్ల ఖర్చు భారం



ఏటా ధాన్యం అమ్ముకునే సమయంలో టార్పాలిన్ల అద్దె కోసం ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇప్పటికే అనేక మంది రైతులకు ఇది అదనపు భారంగా మారింది. గతంలో మాదిరిగా ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్ కవర్లు రైతులకు అందించాలి. అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

–కున్సోత్ చందర్, రైతు, లక్ష్మీదేవిపల్లి

అదనంగా మిషన్లు ఏర్పాటు చేయాలి



ప్రస్తుతం తూర్పారబట్టే మిషన్లు రెండు మాత్రమే ఉన్నాయి. ఈ రెండింటితో రోజులో రెండు మూడు కుట్ల ధాన్యాన్ని మాత్రమే తూర్పారబడుతున్నారు. శాతానికి వచ్చిన ధాన్యం కుప్పలు అలానే ఉంటున్నాయి. మరో రెండు మిషన్లను ఏర్పాటు చేయాలి.

–మహబూబ్ అలీ, రైతు, సుజాతనగర్

క్లుప్తంగా

కార్యకర్తకు అండగా ఎంపీ రవిచంద్ర


నరసింహారావును పరామర్శిస్తున్న ఎంపీ

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చెంగల నరసింహారావు కొంతకాలంగా మెదడులో కణితితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర దృష్టికి కుటుంబీకులు, స్థానిక నాయకులు తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ రవిచంద్ర హైదరాబాద్ నిమ్స్‌లో నరసింహారావును చేర్పించగా.. వైద్యులు ఆపరేషన్ చేసి మెదడులోని కణితి తొలగించారు. కాగా, నరసింహారావును సోమవారం ఎంపీ రవిచంద్ర పరామర్శించారు. ఆయన భార్య నాగమణి, కుమార్తె నాగశైలును ఎంపీ ఓదార్చారు. ఎంపీ వెంట హైకోర్టు అడ్వకేట్ ఉసా రఘు, దిండిగల రాజేందర్, లకావత్ గిరిబాబు, మురళి ఉన్నారు.

ఒలింపిక్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్‌గా సాబీర్‌పాషా


సాబీర్‌పాషాను సన్మానిస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషాను క్రీడా సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. సోమవారం పట్టణంలోని ఓ హోటల్‌లో జరిగిన ఒలింపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. డాక్టర్ జి.యుగంధర్‌రెడ్డి, కె.మహీధర్, వై.వెంకటేశ్వర్లు, కాశీహుస్సేన్, మట్టపర్తి రమేశ్, డి.మల్లికార్జున్, బాబ్జి, బరిగెల భూపేశ్, రఘు, రమేశ్, ఎం.జశ్వంత్, సత్తిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ హేమచంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ-పవర్ బస్తీ, ప్యూన్‌బస్తీ, గంగాబిషన్‌బస్తీ, ఎస్‌సీబీనగర్, గరిమెళ్లపాడు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

స్థలాలు కబ్జాకు గురికావొద్దు..


సింగరేణి స్థలాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

ఇల్లెందు: సింగరేణి సంస్థ స్థలాలు కబ్జా కాకుండా కాపాడాలని జీఎం(సెక్యూరిటీ) సీహెచ్ లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం ఇల్లెందు ఏరియాలో ఆయన పర్యటించి, సింగరేణి స్థలాలు, సోలార్ పవర్ ప్లాంట్‌ను పరిశీలించారు. చోరీల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జేకేఓసీలోని స్క్రాప్ యార్డు, పాత టైర్లను పరిశీలించారు. ఆయన వెంట సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అర్హులకు ఇవ్వాలి

ఇల్లెందురూరల్: ప్రభుత్వం ప్రకటించిన పైలెట్ గ్రామాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో బాధితులతో కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వజ్జ సురేశ్, మూతి రాజశేఖర్, ఉమ, లత, హేమ, కౌసల్య, కాంతమ్మ, కోటమ్మ, వెంకటమ్మ, సుమలత, హైమ తదితరులు పాల్గొన్నారు.

కశ్మీర్ మృతులకు సంతాపం

పాల్వంచరూరల్: మండల పరిధి అంబేడ్కర్‌కాలనీలోని మెర్సీ చర్చిలో సోమవారం క్రైస్తవుల జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి.. జమ్ము కశ్మీర్‌లో టెర్రరిస్టుల కాల్పుల్లో మృతిచెందినవారికి సంతాపం ప్రకటించారు. సమావేశంలో గోసె సాల్మన్ మాట్లాడగా.. జయకుమార్, బిషప్ స్టీవెన్, జాన్‌విల్సన్, విజయకుమార్, సదానంగం, అనిల్, దయాకర్, యేసుదాస్, రవి పాల్గొన్నారు.

కష్ట జీవులను ఐక్యం చేసిన మార్క్స్


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): పెట్టుబడిదారులు సాగిస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు, కష్టజీవులను ఏకం చేసే సిద్ధాంతాన్ని రూపొందించి, మానవ శ్రమకు విలువ చేకూర్చిన మహా మేధావి కార్ల్ మార్క్స్ అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మార్క్స్ జయంతి సందర్భంగా శేషగిరిభవన్‌లో సోమవారం ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కూనంనేని పూలమాల వేసి నివాళులర్పించారు. మార్క్స్ జీవిత చరిత్రను వివరించారు. ఆయన అడుగు జాడల్లో కమ్యూనిస్టులు పయనించి కమ్యూనిజాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌కె సాబీర్‌పాషా, కొరిమి రాజ్‌కుమార్, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, దమ్మాలపాటి శేషయ్య, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, ఫహీం, గోవింద్, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల కోసం పోరాటం

పాల్వంచ: పేద వర్గాల కోసం పోరాడిన వ్యక్తి వెంపటి సూర్యనారాయణ అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక తనూజా బాంకెట్ హాల్‌లో సీపీఐ సీనియర్ నేత వెంపటి సూర్యనారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో బాగం హేమంతరావు, మహ్మద్ మౌలానా, ఎస్‌కె.సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, సింగ్ నరసింహారావు, ఎర్రబాబు, కళావతి, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి ఎంపీడీఓగా జేఎల్ గణేశ్‌గాంధీ

టేకులపల్లి: మండల ఎంపీడీఓ (ఎఫ్ఏసీ)గా జేఎల్ గణేశ్‌గాంధీ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రవీందర్‌రావు అనారోగ్యం కారణంగా 20 రోజులపాటు సెలవు పెట్టారు. తరువాతి స్థానంలో ఉన్న సూపరింటెండెంట్‌కు ఇటీవల గుండాల ఎంపీడీఓగా బాధ్యతలు ఇచ్చారు. టేకులపల్లి ఎంపీఓగా పనిచేస్తున్న గాంధీకి ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ కాగా, సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం


చిన్నప్పయ్య

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి దోస్త్ ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపల్ చిన్నప్పయ్య సోమవారం తెలిపారు. కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, అన్ని విభాగాల్లో పీహెచ్‌డీ, నెట్, సెట్ లాంటి అర్హతలతో అపార అనుభవం కలిగిన అధ్యాపక బృందం ఉందని తెలిపారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులను విజేతలుగా నిలిపేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సౌకర్యం ఉందని, విద్యార్థులు తొలి ప్రాధాన్యతగా ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంచుకోవాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

జూలూరుపాడు: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. సోమవారం జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, 44 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రాపురం గ్రామానికి చెందిన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ, మండల కార్యదర్శి బానోత్ ధర్మా ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ స్వాతిబిందు, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ బాదావత్ రవి, పీఆర్ డీఈ నాగేందర్, ఏఈ కార్తీక్‌తోపాటు వెంకటరెడ్డి, నరసింహారావు, శ్రీనివాసరావు, మంగీలాల్‌నాయక్, సురేశ్, లచ్చునాయక్, మధుసూదన్‌రావు, నవీన్‌రాథోడ్, గోపాల్‌రెడ్డి, రాంబాబు, శాంతిరామ్, గోపి, కాన్షీరామ్, రామకృష్ణ, శ్రీను, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

పాల్వంచరూరల్: గ్రామగ్రామాన బీజేపీని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ తెలంగాణ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. సోమవారం పట్టణంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. మార్తినేని మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, ఈ నెల 15 లోపు పోలింగ్ బూత్ కమిటీలను పూర్తి చేయాలని చెప్పారు. రానున్న రోజుల్లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీకి ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, యాప సీతయ్య, కేవీ రంగాకిరణ్, జంపన సీతారాములు, శ్రీనివాసరావు, ధర్మ, సతీశ్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రమేశ్

జూలూరుపాడు: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేశ్ అన్నారు. సోమవారం జూలూరుపాడులో బీజేపీ మండల కమిటీ సమావేశం నిర్వహించగా పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా భూక్యా రమేశ్ బాధ్యతలు స్వీకరించగా.. ఆయన్ను సన్మానించి, స్వీట్లు తినిపించారు. సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, నిమ్మటూరి రామారావు, ధరావత్ బాలకిషన్, గుగులోత్ రాంబాబు, భూక్యా రవి, భూక్యా చరణ్, సిరిపురపు పుల్లారావు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనండి..


సమ్మె నోటీస్ అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీఎం పర్సనల్ కవితనాయుడుకు సమ్మె నోటీస్ అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు.

మూఢత్వంపై యుద్ధం చేయండి..


మాట్లాడుతున్న వక్త

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా యుద్ధం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.వీరభద్రం, రాష్ట్ర బాధ్యురాలు ఎ.కస్తూరి పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాబూక్యాంప్‌లోని జేబీఎస్ స్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు మంచి చెడులపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మ్యాజిక్, సరదా గణితం, ద్విసంఖ్యామానం గురించి వివరించారు. అలాగే, డాక్టర్ రాజ్యలక్ష్మి ఆరోగ్య చిట్కాలు వివరించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు ఎస్.సాయిబాబా, ప్రత్యేక ఆహ్వానితులు కొల్లు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ముగడ మోహన్‌రావు, సెక్రటరీ తిరుపాలు, బాలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులు ప్రారంభం


జూలూరుపాడు: విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ జుంకీలాల్


టేకులపల్లి: బోడు హైస్కూల్‌లో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

జూలూరుపాడు: ఉచిత సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ అన్నారు. సోమవారం జూలూరుపాడు, పాపకొల్లు హైస్కూళ్లలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను ఎంఈఓ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో నాగరాజశేఖర్, లక్ష్మీనర్సయ్య, ఎస్కే మీరాసాహెబ్, మందా ప్రశాంతి, రాంశెట్టి శ్రీనివాసరావు, నంద్రు గురుమూర్తి, ప్రసాద్, బోడా కృష్ణ, కేలోత్ లలిత, శకుంతల, బానోత్ నవీన్‌రాథోడ్, శ్రీకాంత్, కొడుమూరి కోటేశ్వరరావు, ధర్మరాజుల వెంకటనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: పట్టణంలోని 21 ఏరియా జెడ్పీ హైస్కూల్‌లో సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది. సోమవారం హెచ్ఎం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. వేసవి సెలవులను వృథా చేయకుండా భవిష్యత్‌లో విద్యకు ఉపయోగపడేలా ఉచిత శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు యోగా శిక్షణ, నృత్యాలు, కరాటే చిత్రలేఖనం కంప్యూటర్ వర్క్స్ వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రమణ, మంచాల వెంకటేశ్వర్లు, వడ్ల అరుణ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: స్థానిక హైస్కూల్‌తోపాటు బోడు, సులానగర్ ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంలు మెరుగు శ్రీనివాస్, అజ్మీర జగన్‌నాయక్, దేవదాసు వేసవి శిబిరాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో నాగమణి, రంగారావు, రాజేశ్, దుర్గా, ప్రభు, భద్రం, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డు ప్రక్రియ షురూ


సుజాతనగర్‌లో రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

సుజాతనగర్: రైతు గుర్తింపు కార్డు ప్రక్రియను సోమవారం ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి గాండ్ల నర్మద తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామని, ఎవరు ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం జూన్ 5వ తేదీ వరకు వ్యవసాయ భూమి కలిగి ఉండి, పట్టా పాస్ పుస్తకం ఉన్న రైతులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. గుండెపుడి రెవెన్యూ పరిధిలో జూలూరుపాడు ప్రధాన రహదారి పక్కన ఉన్న సర్వేనంబర్ 264/ఆలో రెండు కుంటల ప్రభుత్వ భూమి ఉంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి చుట్టూ ఫెన్సింగ్ వేసి రేకుల షెడ్డు నిర్మించాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ స్వాతిబిందు ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, పోలీసులు సహకారంతో రేకులషెడ్డును తొలగించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గుండెపుడి రెవెన్యూ సర్వే నంబర్ 264/ఆలో 2 కుంటల ప్రభుత్వ భూమి ఉందని, దీనిని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌కు కేటాయించామని, ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సీహెచ్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు అసిస్టెంట్ డీఎంగా సునీత



ఇల్లెందు: ఇల్లెందు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ డిపో మేనేజర్‌గా కె.సునీత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన సంజీవరాణి గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన విషయం విదితమే. ఆమె స్థానంలో సునీత బాధ్యతలు చేపట్టిన తర్వాత డీఎం దేవేందర్‌గౌడ్, ఎమ్మెల్యే కనకయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. డిపో సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ట్యాంకర్లు వస్తేనే నీరు..

- కొత్తగూడెంలో ఐదు రోజులుగా నీటి సరఫరా బంద్
- రామవరంలో ఏడు రోజుల నుంచి..
- ముందస్తు ప్రణాళిక రూపొందించడంలో అధికారుల విఫలం


పట్టణంలో ట్యాంకర్ దగ్గర నీరు పడుతున్న ప్రజలు

కొత్తగూడెంఅర్బన్: ఇళ్ల ముందు నీటి ట్యాంకర్లు ఎప్పుడు వస్తాయని ఎదురుచూస్తున్న పరిస్థితి కొత్తగూడెం మున్సిపాలిటీలో నెలకొన్నది. పైపులైన్ల బిల్లుల కోసం లీకేజీల పేరు చెబుతున్నారో..? లేదా నిజంగానే పైపులైన్లు లీక్ అవుతున్నయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనా పట్టణ ప్రజలు నీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా లక్షకుపైగా ఉన్న జనాభా ఎక్కువగా కిన్నెరసాని నీటిని తాగునీరుగా వినియోగించడంతో పాటుగా ఇంటి అవసరాలకు కూడా ఉపయోగిస్తారు. పట్టణంలో అన్ని వార్డుల్లో కూడా రెండు, మూడు రోజులకు ఒక్కసారి, అది కూడా సమయపాలన లేకుండా పంపులు వచ్చినా కూడా ప్రజలు విమర్శలు చేయకుండా నీటిని పట్టుకుంటున్నారు. అయితే, గత ఏప్రిల్ నుంచి పట్టణంలో నీటి కష్టాలు ఎక్కువ అయ్యాయి. రేగళ్ల చెరువులో నుంచి ఉన్న కిన్నెరసాని ప్రధాన పైపులైన్ పగిలిందని నెలన్నర నుంచి అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. అప్పటి నుంచి కూడా పంపులు 4, 5 రోజులకు ఒక్కసారి వస్తున్నాయి. నెలన్నర నుంచి పైపులైన్‌కు ఎందుకు మరమ్మతులు చేయడం లేదు..? మరమ్మతులు చేసిన కూడా బిల్లుల కోసం అదే కారణం చెబుతున్నారో తెలియడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయ ఉన్నతాధికారులు రేగళ్లలో లీకేజీ అయిన పైపులైన్ ప్రాంతాన్ని పరిశీలించి నిజమైతే త్వరితగతిన మరమ్మతులు చేయించి పట్టణానికి కిన్నెరసాని నీటి సరఫరా చేయాల్సిన అవసరముందని, లేకుంటే సంబంధిత కాంట్రాక్టర్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వేసవిలో నీటి అవసరాలు మిగతా రోజుల కంటే పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఐదు రోజులకు పైగా..

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో 29 వార్డులు పట్టణంలో ఉండగా, 7 వార్డులు రామవరంలో ఉన్నాయి. పట్టణంలో గత ఐదు రోజులుగా కిన్నెరసాని నీటి సరఫరా బంద్ అయ్యింది. కొన్ని ఏరియాల్లో 6, 7 రోజులు అవుతోందని అక్కడి స్థానికులు చెబుతున్నారు. దీంతో పాటుగా రామవరం 7 వార్డుల్లో కూడా ఏడు రోజులుగా నీటి సరఫరా బంద్ కావడంతో అక్కడి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి పైపులైన్‌కు మరమ్మతులు వెంటనే చేయించి నీటి సరఫరా చేయాలని కోరుతున్నారు. దీంతో పాటుగా పట్టణం, రామవరం ఏరియాల్లో కిన్నెరసాని పంపుల్లో నీరు విడుదల చేసే సమయాలు కేటాయించాలని, వాటి ప్రకారం నీటి సరఫరా చేస్తే ఇళ్లలో ఎవరో ఒకరు ఉండి నీటిని పట్టుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. కానీ, సమయపాలన లేకుండా ఇష్టానుసారం పంపు ఆపరేటర్లు నీటి సరఫరా చేయడం, ఆయా సమయాల్లో ఇంట్లో లేని వారు నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ట్యాంకర్ల కొరత

కొత్తగూడెం మున్సిపాలిటీలో లక్షకు పైగా జనాభా ఉన్నారు. మున్సిపాలిటీలో మూడు నీటి ట్యాంకర్లు ఉన్నాయి. ఈ మూడు ట్యాంకర్లు సమయానికి అన్ని వార్డులకు నీటిని అందించలేకపోతున్నాయి. రామవరానికి నీటి ట్యాంకర్ వెళ్తే, పట్టణంలోని ప్రజలు ట్యాంకర్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. పట్టణంలో ట్యాంకర్ నీటి సరఫరా చేస్తే.. రామవరం ప్రజలకు మరుసటి రోజు ఇవ్వాల్సి వస్తోంది. కాగా, త్వరలో కొత్తగూడెం పూర్తిస్థాయిలో కార్పొరేషన్ కాబోతుండగా ప్రజల కష్టాలు అదేవిధంగా కనిపిస్తున్నాయి. హోదాకు తగినట్లుగా ప్రజల సమస్యలను పరిష్కరించడం, వారికి సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు పేర్కొంటున్నారు.